సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 5 । జనవరి । 2024



యువభేరికి ఏయూ సిద్ధం

యువతలో కళా ప్రతిభను వెలికితీసే సాంస్కృతిక వేడుక(యువభేరి)కు ఆంధ్ర విశ్వవిద్యాలయం సిద్ధమైంది. 8లో



ఒడిశా గవర్నర్‌తో ఈఎన్‌సీ చీఫ్

తూర్పు నావికాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్‌ను కలిశారు. 8లో



సింహగిరిపై రంగవల్లులు

గిన్నిస్ బుక్‌లో చోటుకోసం బెంగళూరుకి చెందిన సంస్థ మహిళలు సింహగిరిపై రంగవల్లులు వేస్తున్నారు. 8లో

పండగలా పింఛన్ల పంపిణీ

- గురువారం 32.22 శాతం పూర్తి
- 8వ తేదీ వరకు పంపిణీ



భీమిలి : పెన్షన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్న అవ్వాతాతలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరుగుతోంది. ఈ నెల నుంచి లబ్ధిదారులు రూ.3వేలు అందుకుంటున్నారు. మా బిడ్డ జగన్‌బాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేలు పెన్షన్ పెంచడం చాలా ఆనందంగా ఉందని అవ్వాతాతలు పేర్కొంటున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. రాత్రి 7 గంటల సమయానికి జిల్లాలో 32.22 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ విభాగం, నగర పరిధిలో జీవీఎంసీ యంత్రాంగం పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తోంది. బయోమెట్రిక్ గుర్తింపు ద్వారానే లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారు. రెండు రోజులుగా బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి బుధ,గురువారం పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం పింఛనుదారుల కోసం రూ.50.38 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 1,60,829 లక్షల మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు అందుతున్నాయి. తుది సమాచారం ప్రకారం గురువారం రాత్రి నాటికి జిల్లాలో 53,951 మందికి పింఛన్లు అందాయి. వీరి కోసం రూ.16.22 కోట్లు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు.

జగన్‌బాబు మాట నిలబెట్టుకున్నారు..



ఈ నెల నుంచి రూ.3 వేలు ఇస్తామని ప్రభుత్వం చెప్పిన ప్రకారం మా ఇంటికి వలంటీరు రెడ్డి సత్తిరాజు పింఛన్ డబ్బులు అందించారు. చాలా సంతోషంగా ఉంది. నాకు 75 సంవత్సరాలు. ఈ వయసులో ఉన్న నాకు ఈ డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్ బాబు పింఛన్ పెంచి అందించారు. అలాంటి వ్యక్తి వల్ల మాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతోంది.

– సూర్ల సత్యవతి, ఆరిలోవ కాలనీ

మెరుగైన పరిపాలన



నేను దివ్యాంగుడిని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా పింఛన్ అందుకుంటున్నాను. ఇప్పుడు నాకు రూ.3 వేలు పెన్షన్ ఇచ్చారు. గత ప్రభుత్వాల కంటే మెరుగ్గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారు.

– పి వెంకటరావు, తాటిచెట్లపాలెం, 45వ వార్డు

'సాగర పరిక్రమ'తో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు



మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల, చిత్రంలో కేంద్ర సహాయ మంత్రి మురుగన్, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల

మహారాణిపేట: సాగర పరిక్రమ కార్యక్రమంతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు రానున్నాయని, మరింత ఆర్థిక భరోసా లభించనుందని కేంద్ర మత్స్య,పశు సంవర్థక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల పేర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో గురువారం 10వ సాగర పరిక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. ఇటీవల తీరప్రాంతాల్లోని ఫార్మాసుటికల్, ఫిష్ ఫీడ్ అసోసియేషన్, ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్, ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, నేచురల్ అసోసియేషన్ల వద్దకు స్వయంగా వెళ్లి వాళ్ల కష్టాలు తెలుసుకున్నానని, వాటికి పరిష్కార మార్గాలు కనుక్కొని వెంటనే అమలు చేస్తానన్నారు. రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తనకు చాలా విషయాలు చెప్పారని, వాటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకుముందు కేంద్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులతో కలిసి కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల హార్బర్‌లో జెట్టీలను పరిశీలించారు. అనంతరం 39 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ద్వారా రూ.23.50 లక్షల రుణాల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అలాగే చేపల రవాణా వాహనం, ఐస్ బాక్సులు కలిగిన 23 ద్విచక్ర వాహనాలు, 27 ఫిష్ ఆంధ్రా యూనిట్లు, 4 లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్ యూనిట్లు, 10 ఓపెన్ సీ కేజెస్ యూనిట్లను 70 మంది మత్స్యకారులకు సబ్సిడీపై అందజేశారు.

రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం పెట్టిన సాగర పరిక్రమ ఎంతో గొప్ప కార్యక్రమమని అన్నారు. కేంద్ర మత్స్య శాఖ జాయింట్ సెక్రటరీ నీతూ ప్రసాద్ , ఎల్.డి.ఎం. శ్రీనివాస రావు, శాసన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, మత్స్య శాఖ కమిషనర్ కే.కన్నబాబు, రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చందర్, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రాష్ట్ర మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్, విశాఖ డాల్ఫిన్ బోటు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, స్థానిక కార్పొరేటర్ చెన్న జానకిరామ్, మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు షేక్ లాల్ మహమ్మద్, సహాయ సంచాలకులు ఎం.విజయకృష్ణ, ఎఫ్.డి.ఓ ఎం. ఆర్. ఆశాజ్యోతి, వివిధ మత్స్యకార సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ట్యాక్స్ పేయర్స్ హబ్



మాట్లాడుతున్న ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ రాజీవ్ కుమార్ సింగ్

సాక్షి, విశాఖపట్నం : ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు ట్యాక్స్ పేయర్స్ హబ్‌ను విశాఖపట్నం బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్నట్లు ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ రాజీవ్ కుమార్ సింగ్ వెల్లడించారు. డాబాగార్డెన్స్‌లోని అయకార్ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏడు నగరాల్లో టాక్స్ పేయర్స్ హబ్‌ను నిర్వహిస్తున్నారని, దక్షిణాది రాష్ట్రాల్లో విశాఖను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి పన్ను చెల్లింపుదారుడు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామి అనే థీమ్‌తో నిర్వహిస్తున్న టాక్స్ పేయర్స్ హబ్ కార్యక్రమాన్ని ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ జనరల్ అర్చన చౌదరి ప్రారంభించనున్నారని వివరించారు. పన్ను చెల్లింపుదారులకు ఇన్ఫర్మేషన్ కియోస్క్, ఫిర్యాదు నమోదు కియోస్క్ సేవలను కూడా అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ వానా శ్రీనివాస్ రావు, డిప్యూటీ కమిషనర్ మధుసూధన రావు, ఆదాయపను పన్ను అధికారులు ఎంవీఎస్ఎస్ భావ నారాయణ, కే.లలిత్, ఎం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమ్మె నేపథ్యంలో ప్రజలు సహకరించాలి



డాబాగార్డెన్స్: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అందుకు ప్రజలందరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె కాలంలో పారిశుధ్య పనుల నిర్వహణలో కలుగుతున్న అంతరాయానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంఘాలు స్పందిస్తూ జీవీఎంసీకి సహకరిస్తున్నందుకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.పారిశుధ్యం తొలగింపునకు డైలీ వేజ్ పద్ధతిన ప్రైవేట్ వర్కర్లను, చెత్తను తరలించడానికి ప్రత్యేకంగా తాత్కాలిక వాహనాలు జీవీఎంసీ ఏర్పాటు చేసిందన్నారు.

రేపు నృసింహ దీక్షల విరమణ

సింహాచలం : శ్రీ నృసింహ దీక్షల విరమణ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి గురువారం తెలిపారు. 41 రోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష తీసుకున్న వారంతా శనివారం దీక్ష విరమింపజేయాలని తెలిపారు.

4,391 మందికి వైద్య సేవలు



ప్రసాద్‌గార్డెన్స్‌లో వైద్య సేవలు పొందుతున్న రోగులు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గురువారం 10 ప్రాంతాల్లో నిర్వహించారు. భీమిలి యూపీహెచ్‌సీ పరిధిలో తోటవీధి లోను, చినముషిడివాడ, బుచ్చిరాజుపాలెం, గాజువాకలో, దేవాడ, ఏకేసీ కాలనీలో, అంబేడ్కర్ కాలనీ, రైల్వే న్యూకాలనీ, కొబ్బరితోట, ఎన్‌జీజీవో కాలనీ, స్వతంత్ర నగర్‌లో నిర్వహించారు. మొత్తం 4,391 మంది రోగులు రాగా..వీరిలో 15 మందిని వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్



తాటిచెట్లపాలెం : అరకు వెళ్లే ప్రయాణికుల, పర్యాటకుల సౌకర్యార్థం విశాఖ-కిరండూల్ - విశాఖ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు ఈ నెల 5, 6, 7, 12, 14, 19, 20, 21, 26, 27, 28వ తేదీల్లోను, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్ -విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఈ నెల 6,7,8,13,14,15,20,21,22, 27,28,29వ తేదీల్లోనూ విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

స్వర్ణభారతికి సరికొత్త సొబగులు



స్వర్ణభారతి స్టేడియం ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

- రూ.16.90 కోట్లతో స్టేడియం ఆధునికీకరణ
- శంకుస్థాపన చేసిన మేయర్ హరివెంకట కుమారి



స్వర్ణభారతి స్టేడియం నమూనా

సీతంపేట: నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంను అధునీకీకరించనున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి గురువారం అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరం క్రీడలకు చాలా అనుకూలమని, జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు వీలైన స్టేడియంలు అవసరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖ నగరంలో క్రీడలు నిర్వహించేందుకు అనుకూలంగా స్టేడియంను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.16.90 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో స్వర్ణభారతి స్టేడియంను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. స్టేడియం బయట, లోపల ఏసీపీ క్లాడింగ్ చిల్లులు కలిగిన మెటల్ క్లాడింగ్, స్ట్రక్చరల్ గ్లేజింగ్ వర్క్, మూడు లేయర్ల రూఫింగ్, బయట ఆట స్థలంలో ఈపీడీఎం ఫ్లోరింగ్, కాంపౌండ్ వాల్‌పై మ్యూరల్ ఆర్ట్స్, టెక్చర్ పెయింటింగ్, స్లైడింగ్ విండోలు, టైల్స్ ఫ్లోరింగ్, రెస్ట్ రూమ్ క్యూబికల్స్ తదితర అత్యాధునిక నిర్మాణ పనుల్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ మరమ్మతులు, హెచ్‌వీఏసీ సిస్టం, సీసీ టీవీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడి ఆలయ నిర్వహణ భేష్



సురేష్ బాబుకు వైభవుడి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో ప్రసాద్

మురళీనగర్: వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్వహణ బాగుందని రాజమండ్రి మల్టీజోన్-1 రీజినల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్ బాబు తెలిపారు. విశాఖ వచ్చిన సందర్భంగా ఎంవీ సురేష్ బాబు సతీసమేతంగా వైభవ వేంకటేశ్వరస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు.

సీఐ, ఎస్ఐలకు బదిలీలు 12లో

నేటి నుంచి ఆంధ్ర, బెంగాల్ రంజీ మ్యాచ్

రంజీ ట్రోఫీలో ఆంధ్ర తొలి మ్యాచ్ విశాఖలోనే..



ప్రాక్టీస్ చేస్తున్న రంజీ క్రికెటర్లు

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ మెన్ క్రికెట్ రంజీ ట్రోఫీ సీజన్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా బెంగాల్ జట్టుతో ఆంధ్రా జట్టు తొలి మ్యాచ్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలోనే ఆడనుంది. మొత్తంగా రంజీ ట్రోఫీలో 32 జట్లు తలపడుతుండగా ఎలైట్ బీ గ్రూప్‌లో ఆంధ్రా జట్టు ఆడుతుంది. ప్రతీ మ్యాచ్ నాలుగేసి రోజులు జరగనుండగా ఇరు జట్లు రెండేసి ఇన్నింగ్స్ ఆడనున్నాయి. ఇప్పటికే ఇరు జట్లు వైఎస్సార్ స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ పూర్తి చేశాయి. గురువారం ఉదయపు సెషన్‌లో ఆంధ్ర, మధ్యాహ్నం సెషన్‌లో బెంగాల్ జట్టు ప్రాక్టీస్ చేశాయి.

ఆంధ్ర జట్టులో విశాఖ కుర్రాళ్లు

ఆంధ్ర జట్టులో నలుగురు విశాఖ కుర్రాళ్లు స్థానం సాధించారు. వీరంతా గతంలోనూ రంజీల్లో ఆంధ్ర జట్టుకు ఆడిన వారే. రికీబుయ్ టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగనుండగా నితీష్‌కుమార్ ఆల్‌రౌండ్ ప్రతిభ చూపనున్నాడు. శశికాంత్ మీడియం పేస్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించనుండగా మనీష్ బ్యాట్‌తో పాటు స్పిన్‌తో బంతిని గింగిరాలు తిప్పనున్నాడు. హనుమ విహారీ జట్టుకు నాయకత్వం వహిస్తుండగా బ్యాట్ ఝుళిపించేందుకు అశ్విన్ హెబ్బర్, రషీద్, గిరినాథ్, జ్ఞానేశ్వర్ సిద్ధమవుతున్నారు. ప్రశాంత్ మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్ చక్కదిద్దేందుకు హనుమకు తోడుకానున్నాడు. శశికాంత్ కుడిచేతి వాటంతో, పృథ్వీ ఎడమ చేతి వాటంతో బౌలింగ్ ప్రారంభించనున్నారు. వీరికి తోడుగా గిరినాథ్‌రెడ్డి, లలిత్, స్టీఫెన్ చెలరేగే బంతులు వేయనున్నారు. ఆల్‌రౌండర్‌గా షోయబ్ ఉండనే ఉన్నాడు. స్థానిక ఆటగాడు భరత్ ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టుతో ఆడే భారత్ జట్టుతో ఉండటంతో కె.పృథ్వీరాజ్ వికెట్ల వెనుక నిలవనున్నాడు. బెంగాల్ జట్టుకు మనోజ్ తివారీ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

ఆంధ్ర ఆడే మ్యాచులివే..

ఆంధ్ర జట్టు ఏడు ప్రత్యర్థి జట్లతో పలు వేదికల్లో తలపడనుండగా.. తొలి మ్యాచ్ వైఎస్సార్ స్టేడియంలోనే జరుగుతుంది. లీగ్ దశలో నాలుగు గ్రూప్‌ల్లో పోటీలు జరగనుండగా.. ఆయా గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకవుట్‌కు అర్హత సాధిస్తాయి.

తేదీ	ప్రత్యర్థి జట్టు
జనవరి 5-8	బెంగాల్
12-15	ముంబయి
19-22	అసోం
26-29	చత్తీస్‌గఢ్
ఫిబ్రవరి 2-5	బిహార్
9-12	ఉత్తరప్రదేశ్
16-19	కేరళ

మంత్రి అమర్‌నాథ్‌తో వైవీ సుబ్బారెడ్డి భేటీ



వైవీ సుబ్బారెడ్డికి నృసింహ స్వామి చిత్రపటం అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి గురువారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో మిందిలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి శాలువా కప్పి, నృసింహస్వామి చిత్ర పటం అందజేశారు. ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు, కార్పొరేటర్లు గుడివాడ అనూష, రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, ఇమ్రాన్, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్, నాయకులు దంతలూరి దిలీప్, మలసాల రమణారావు, ధనమ్మ, బోగాది సన్యాసిరావు, జి.పూర్ణానంద శర్మ, గుడివాడ లతీష్, గుడివాడ అప్పలరామ్మూర్తి, వాసు పాల్గొన్నారు.

సాంస్కృతిక వేడుకకు ఏయూ సిద్ధం

- నేటి నుంచి సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ యూత్ ఫెస్టివల్
- ఐదు రోజుల పాటు సందడే సందడి

ఏయూక్యాంపస్: యువతలో కళా ప్రతిభను వెలికి తీసే సాంస్కృతిక వేడుకకు ఆంధ్ర విశ్వవిద్యాలయం సిద్ధమైంది. ఏయూ వేదికగా శుక్రవారం నుంచి 9వ తేదీ వరకు 37వ సౌత్‌జోన్ అంతర్ విశ్వ విద్యాలయాల యూత్ ఫెస్టివల్(యూనిఫెస్ట్) జరగనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 20కిపైగా విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ ఫెస్ట్‌కు హాజరవుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో విద్యార్థులు వర్సిటీకి చేరుకున్నారు. వీరికి వర్సిటీలోని రెండు వసతి గృహాల్లో వసతి కల్పించారు. వీరితో వచ్చే మేనేజర్లు, న్యాయ నిర్ణేతలకు ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేశారు.

సాంస్కృతిక ర్యాలీతో ప్రారంభం..

యువభేరి పేరుతో నిర్వహిస్తున్న యూత్ ఫెస్టివల్‌ను శుక్రవారం సాయంత్రం 3 గంటలకు సాంస్కృతిక ర్యాలీతో లాంఛనంగా ప్రారంభిస్తారు. ఏయూ పరిపాలన భవనం వద్ద నుంచి విద్యార్థులు ర్యాలీగా ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం, అమెరికన్ కార్నర్, ఏయూ ఇన్‌గేట్ మీదుగా బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్‌కి చేరుకుంటారు. ర్యాలీలో విద్యార్థులు తమ సంప్రదాయ వస్త్రధారణ, సంగీత వాయిద్య పరికరాలతో పాల్గొంటారు. ఈ ఫెస్ట్‌కి ప్రత్యేక ఆకర్షణగా ఈ ర్యాలీ నిలవనుంది. సాయంత్రం 5 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా కార్యక్రమం ప్రారంభమవుతుంది.



ఏయూలో సిద్ధమైన ప్రధాన వేదిక

నాలుగు వేదికలు.. : మొత్తం ఆరు విభాగాల్లో 28 అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఇందుకోసం నాలుగు వేదికలను ఏర్పాటు చేశారు. సంగీత, నృత్య, నాటక, కళా రంగ పోటీలకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌తో పాటు సాగరికలోని రెండు హాళ్లను కేటాయించారు. వీటిలో ఏకకాలంలో విభాగాల వారీగా పోటీలను నిర్వహిస్తారు. క్విజ్, డిబేట్ పోటీలు ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్) ప్రాంగణంలో జరుగుతాయి. ప్రధానమైన పోటీలు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ నెల 9న కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహుమతుల ప్రదానోత్సవం ఉంటుంది. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి ధ్రువీకరణపత్రం, మెడల్ అందజేస్తారు. విద్యార్థులకు కేటాయించిన వసతి గృహాల నుంచి ప్రధాన వేదికలకు చేరుకోవడానికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. ది అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ(ఏఐయూ) ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, ఏయూ సమన్వయంతో యూత్ ఫెస్ట్‌ని నిర్వహిస్తున్నారు. సంగీతంలో 8 విభాగాల్లో, నృత్యంలో రెండు విభాగాలు, లిటరసీలో మూడు విభాగాలు, థియేటర్‌లో నాలుగు విభాగాలు, ఫైన్ ఆర్ట్స్‌లో 8 విభాగాల్లో పోటీలు జరుగుతాయి.

ఒడిశా గవర్నర్‌ను కలిసిన ఈఎన్‌సీ చీఫ్

సింధియా: తూర్పు నావికాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, అతని భార్య సంధారావు పెంధార్కర్‌తో కలిసి గురువారం భువనేశ్వర్‌లో ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్‌ను కలిశారు. ఒడిశాలో భారత నావికాదళం చేపడుతున్న సముద్ర కార్యకలాపాలు, సామర్థ్యం పెంపుదల, ప్రణాళికలు, అవుట్‌రీచ్ కార్యకలాపాలపై చర్చించారు. అనంతరం సంధారావు వెటరన్ కమ్యూనిటీ, వీర్ నారీస్‌తో సంభాషించారు. భేటీలో భాగంగా ఒడిశా గవర్నర్‌కు జ్ఞాపికను బహూకరించారు.

ట్యూషన్ సెంటర్‌పై దాడి కేసులో ఐదుగురికి రిమాండ్

సీతమ్మధార: బైజ్యూస్ ట్యూషన్ సెంటర్‌పై దాడి చేసిన ఐదుగురు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సమితి ప్రతినిధులను ద్వారకా పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ద్వారకానగర్‌లోని బైజ్యూస్ ట్యూషన్ సెంటర్‌లో బుధవారం పెందుర్తిలోని ముత్యాలమ్మ కాలనీకి చెందిన ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎర్రిపల్లి రాంబాబు, అతని సోదరుడు ఎర్రిపల్లి సాయిబాబు, న్యూ గాజువాకలోని సంజీవగిరి కాలనీకి చెందిన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు, అల్లిపురం నీలంరాజశేఖర్‌రెడ్డి భవన్ ప్రాంతానికి చెందిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు, పెందుర్తిలోని ముత్యాలమ్మ కాలనీకి చెందిన గుర్రాల ఎర్రయ్య ఐరాన్ రాడ్‌లతో విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. వీరిపై 307, 353 సెక్షన్ల కింద ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. మరో ముగ్గురు కోసం గాలింపు చేపడుతున్నారు.

టీడీపీ కార్పొరేటర్ చీప్ ట్రిక్



వైఎస్సార్ కాలనీలో చురుగ్గా సాగుతున్న మెట్ల మార్గ నిర్మాణం(గత నెల 28న తీసిన ఫొటో)

మధురవాడ: తెలుగుదేశం నాయకులు చీప్ ట్రిక్స్ ప్రదర్శించారు. ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనులకే గురువారం మళ్లీ భూమి చేసి రాజకీయ లబ్ధి కోసం నానాపాట్లు పడ్డారు. వివరాలివీ.. గత ఏడాది సెప్టెంబర్ 28న జీవీఎంసీ 5వ వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరదేశిపాలెంలో శంకుస్థాపన చేశారు. తర్వాత ఆయా ప్రాంతాల్లో పనులు చకచకా జరుగుతున్నాయి. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం టీడీపీ కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులతో కలసి వైఎస్సార్ కాలనీలో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కాలనీలో ఇప్పటికే జరుగుతున్న పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం ఏంటని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. దీనిపై ఏఈ సురేష్‌ను వివరణ కోరగా.. అధికారులకు సమాచారం ఇవ్వకుండానే శంకుస్థాపన చేపట్టారని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసం మళ్లీ శంకుస్థాపన



ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్, టీడీపీ నాయకులు

సింహగిరిపై రంగవల్లులు

గిన్నిస్ బుక్‌లో చోటు కోసం ప్రయత్నం

సింహాచలం: సింహగిరిపై రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిని బెంగళూరుకి చెందిన రంగవల్లి ఆర్ట్ ఫౌండేషన్ మహిళలు పలు రకాల రంగవల్లులతో విశేషంగా తీర్చిదిద్దుతున్నారు. గురువారం ఈ కార్యక్రమం మొదలుపెట్టారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుకోసం బెంగళూరుకి చెందిన రంగవల్లి ఆర్ట్ ఫౌండేషన్ దేశ వ్యాప్తంగా పలు ఆలయాల్లో రంగవల్లులు వేస్తున్నారు.

విజ్ఞాన్‌తో లియో గ్లోబల్ ఒప్పందం

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, లియో గ్లోబల్ ఓవర్‌సీస్ సంస్థల మధ్య గురువారం ఎంవోయూ జరిగింది. ఈ సందర్భంగా రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య, పరిశోధనలు, వినూత్న ప్రయోగాలు చేసే విద్యార్థులకు ఈ ఒప్పందం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్, లియో గ్లోబల్ ఓవర్‌సీస్ సంస్థ ప్రతినిధులు వాసవి కోన, కె.రాజేంద్ర పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌లో భారీ చోరీ

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని ఓ సినిమా థియేటర్‌లో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి క్రైం సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలివీ.. గాజువాకలోని మోహిని థియేటర్ యజమాని వంశీ కిశోర్ త్వరలో రిలీజ్ కానున్న గుంటూరు కారం సినిమాకు అడ్వాన్స్ కట్టాలని ఈ నెల 2న రూ.20 లక్షల నగదును మేనేజర్ అలీకి ఇచ్చారు. అతను తన గదిలోని టేబుల్ డెస్క్‌లో ఆ మొత్తాన్ని రాత్రి 10.30 గంటల సమయంలో పెట్టి తాళం వేశాడు. 3న ఈ మొత్తానికి డీడీ తీయాల్సి ఉంది. కాగా.. బుధవారం ఉదయం థియేటర్‌కు వచ్చిన మేనేజర్.. టేబుల్ డెస్క్ విరగ్గొట్టి ఉండటాన్ని గమనించాడు. అందులో ఉంచి రూ.20 లక్షల నగదు చోరీ జరిగిన విషయాన్ని థియేటర్ యజమానికి తెలియజేశాడు. వెంటనే వీరు గాజువాక క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. సీఐ సూర్యనారాయణ థియేటర్‌కు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వేలుముద్రలు సేకరించింది. థియేటర్‌లోని సీసీ కెమెరాలు మూడు నెలలుగా పనిచేయడం లేదని పోలీసులు తెలిపారు. సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో సీవీఐ సెంటర్ ప్రారంభం



పాలకుర్తి విజన్ ఎయిడ్ సెంటర్ బోర్డు ఆవిష్కరిస్తున్న కంటి వైద్య నిపుణులు

ఆరిలోవ: హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యాలయంలో గురువారం పాలకుర్తి ఫౌండేషన్ సహకారంతో విజన్ ఎయిడ్ పేరిట సెరిబ్రల్ విజువల్ ఇంపైర్‌మెంట్ రిసోర్స్ సెంటర్(సీవీఐ)ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజన్ రిహేబిలిటేషన్ అధినేత డాక్టర్ బి.క్రిస్టి మాట్లాడుతూ సీవీఐ సెంటర్ చిన్న పిల్లల దృష్టికి సంబంధించిన సేవలు అందిస్తుందన్నారు. సెరిబ్రల్ దృష్టి లోపంతో బాధపడుతున్న పిల్లల జీవితాలను మెరుగుపరిచేలా సేవలు అందుతాయన్నారు. సుమారు 30 శాతం నుంచి 40 శాతం పిల్లలు సీవీఐ వ్యాధి బారిన పడుతున్నారని ఈ వ్యాధి పిల్లల శారీరక, మానసిక, జీవన శైలిపై ప్రభావం చూపుతుందన్నారు. ఇక్కడ క్లినికల్ పరీక్షలు, అనుకూలమైన దృష్టి అంచనాలు, విజన్ థెరపీ, దృష్టి నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్వీపీ హెడ్ డాక్టర్ భావిక్ పాంచల్, ఫౌండేషన్ ప్రతినిధి ప్రశాంత్ పాలకుర్తి పాల్గొన్నారు.